## మోహన్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గోవా వేదికగా జరుగుతున్న 22వ జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్ప్రింటర్ మోహన్ హర్ష కాంస్య పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన పురుషుల టీ46 100మీటర్ల రేసును మోహన్ 11.25 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచాడు. కాంస్యం సొంతం చేసుకున్న పారా అథ్లెట్ మోహన్‌ను జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్ అభినందించారు.

## నాగల్‌కు సూపర్ చాన్స్

మెల్‌బోర్న్: భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమీత్ నాగల్.. ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ 'డ్రా'కు అడుగు దూరంలో నిలిచాడు. క్వాలిఫయింగ్ టోర్నీలో నాగల్ దుమ్మురేపుతున్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో నాగల్ 6-3, 6-2తో ఎడ్వర్డ్ వింటర్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. శుక్రవారం జరగనున్న క్వాలిఫయింగ్ చివరి పోరులో అలెక్స్ మోల్కాన్ (స్లోవేకియా)పై గెలిస్తే నాగల్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో అడుగుపెట్టనున్నాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 139వ స్థానంలో ఉన్న నాగల్.. గతంలో మూడుసార్లు (2019 యూఎస్ ఓపెన్, 2020 యూఎస్ ఓపెన్, 2021 ఆస్ట్రేలియా ఓపెన్) గ్రాండ్‌స్లామ్ మెయిన్ టోర్నీకి అర్హత సాధించాడు.

## యోధాస్‌కు నిరాశ

కటక్: అల్టిమేట్ ఖో ఖో లీగ్‌లో తెలుగు యోధాస్‌కు నిరాశ ఎదురైంది. గురువారం జరిగిన సెమీఫైనల్లో యోధాస్ 29-31తో చెన్నై క్విక్‌గన్స్ చేతిలో ఓటమిపాలైంది. మ్యాచ్‌లో తొలుత యోధాస్ ఆధిక్యం కనబరిచినా..చెన్నై అద్భుతంగా పుంజుకుని పోటీలోకి వచ్చింది. అంతకుముందు జరిగిన తొలి సెమీస్‌లో గుజరాత్ జెయింట్స్ 29-27తో ఒడిశా జాగర్‌నెట్స్‌పై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం గుజరాత్, చెన్నై మధ్య ఫైనల్ పోరు జరుగనుంది.

# శివ తాండవం

### తొలి టీ20లో భారత్ విజయం • మెరిసిన అక్షర్, జితేశ్

**ఎముకలు కొరికే చలి.. చేతులు గడ్డగట్టించే శీతల వాతావరణంలో.. టీమ్‌ఇండియా అదరగొట్టింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కదంతొక్కిన రోహిత్ సేన.. అఫ్గానిస్థాన్‌పై తొలి టీ20లో విజయం సాధించింది. 14 నెలల విరామం తర్వాత రోహిత్ తొలిసారి పొట్టి ఫార్మాట్‌లో దర్శనమివ్వగా.. చాన్నాళ్ల తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న ఆల్‌రౌండర్ శివమ్ దూబే అటు బంతితో ఇటు బ్యాట్‌తో దుమ్మురేపగా.. హైదరాబాదీ యంగ్ గన్ తిలక్ వర్మ ఆకట్టుకున్నాడు.**

దుమ్మురేపిన శివమ్ దూబే

శివమ్ దూబే (60*)

మొహాలీ: పొట్టి ప్రపంచకప్ జరగనున్న ఏడాదిలో టీమ్‌ఇండియా ఈ ఫార్మాట్‌లో విజయంతో ఖాతా తెరిచింది. మెగాటోర్నీకి ముందు ఆడుతున్న చివరి సిరీస్‌లో రోహిత్ సేన శుభారంభం చేసింది. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి టీ20లో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో గెలిచింది. విపరీతమైన చలి వాతావరణంలో.. ఆటగాళ్లు బంతి పట్టుకోవడం కూడా కష్టంగా మారిన సమయంలో మనవాళ్లు చక్కటి ప్రదర్శన చేశారు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుండగా.. దానికి ముందు భారత్ ఆడుతున్న చివరి పొట్టి సిరీస్ ఇదే కావడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు పెట్టింది. మహమ్మద్ నబీ (42; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. అజ్మతుల్లా (29), ఇబ్రహీం (25), రహ్మానుల్లా (23) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్, ముఖేశ్ కుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసింది. పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే (40 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో మెరవగా.. జితేశ్ శర్మ (31; 5 ఫోర్లు), తిలక్ వర్మ (26; 2 ఫోర్లు, ఒక సిక్సర్), గిల్ (23; 5 ఫోర్లు) రాణించారు. గిల్‌తో సమన్వయ లోపంతో కెప్టెన్ రోహిత్ (0) రనౌట్‌గా వెనుదిరిగాడు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్ 2 వికెట్లు పడగొట్టాడు. దూబేకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో టీ20 జరగనుంది.

**సంక్షిప్త స్కోర్లు**

**అఫ్గానిస్థాన్:** 158/5 (నబీ 42, అజ్మతుల్లా 29; అక్షర్ 2/23, ముఖేశ్ 2/33),

**భారత్:** 17.3 ఓవర్లలో 159/4 (దూబే 60 నాటౌట్, జితేశ్ 31; ముజీబ్ 2/21).

## గడ్డకట్టించే చలి..

భారత్, అఫ్గానిస్థాన్ మధ్య పోరులో విచిత్ర సంఘటనలు దర్శనమిచ్చాయి. స్వదేశంలో టీమ్‌ఇండియా మ్యాచ్ ఆడుతుందంటే.. మైదానాలు నిండిపోవడం మామూలే కాగా.. మ్యాచ్ ఆరంభమయ్యేంత వరకు స్టేడియంలో అసలు ఒక్క అభిమాని కూడా కనిపించలేదు. టాస్ వేస్తున్న సమయంలో కూడా స్టాండ్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ సిరీస్‌పై ఫ్యాన్స్‌కు పెద్దగా ఆసక్తి లేదనుకుంటే పొరబడినట్లే! దీనంతటికీ అసలు కారణం చలి. మొహాలీలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇటు ఆటగాళ్లు, అటు అభిమానులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఫీల్డ్ అంపైర్లు ఎప్పుడూ లేని విధంగా గ్లౌజ్‌లు వేసుకొని విధులు నిర్వర్తించగా.. ఫీల్డర్లు మాత్రం ఎక్కువ శాతం చేతులు జేబుల్లో పెట్టుకునేందుకే ప్రాధాన్యతనిచ్చారు. ఇక కెప్టెన్ రోహిత్ శర్మ అయితే పదే పదే చేతులు వణకకుండా.. సహాయ సిబ్బంది ద్వారా వేడి నీటితో కూడిన ప్రత్యేక ప్యాకెట్ తెప్పించి కాస్త శరీర ఉష్ణోగ్రత పెంచుకునేందుకు ప్రయత్నించాడు. భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయానికి స్టేడియం నిండిపోయినా.. అందరూ జాకెట్లతో దర్శనమిచ్చారు. మ్యాచ్ జరుగుతున్నా కొద్దీ పొగమంచు పెరుగుతూ పోయింది.

## చాంపియన్ హర్యానా

ముగిసిన జాతీయ కబడ్డీ టోర్నీ

కామారెడ్డి, జనవరి 11: జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ టోర్నీలో హర్యానా చాంపియన్‌గా నిలిచింది. కామారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కబడ్డీ పోటీలు ముగిశాయి. గురువారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా 58-51తో కర్ణాటకపై అద్భుత విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్లు కడదాకా సాగిన మ్యాచ్‌లో హర్యానానే విజయం వరించింది. మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో ఆతిథ్య తెలంగాణ..ఢిల్లీ టీమ్‌ను మట్టికరిపించింది. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ట్రోఫీలు అందజేశారు.

## కేబీడీ సూపర్-8లో ఓబుల్‌రెడ్డి స్కూల్

హైదరాబాద్: స్టార్‌స్పోర్ట్స్ నిర్వహిస్తున్న కేబీడీ జూనియర్ టోర్నీలో ఓబుల్‌రెడ్డి స్కూల్ సూపర్-8లోకి దూసుకెళ్లింది. గురువారం ఓబుల్‌రెడ్డి ఇండోర్ కాంప్లెక్స్‌లో జరిగిన లీగ్ పోటీల్లో ఇతర పాఠశాలలను ఓడించి ఓబుల్‌రెడ్డి స్కూల్ సూపర్-8కు అర్హత సాధించింది. హైదరాబాద్ లెగ్ ఫైనల్స్ ఈ నెల 23న గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. 2017లో జాతీయ స్థాయిలో మొదలైన జూనియర్ కబడ్డీ పోటీలు కరోనా వైరస్ విజృంభణ కారణంగా నిర్వహించలేదు. అయితే పరిస్థితులు చక్కబడటంతో 2023లో సీజన్ 4ను ప్రారంభించారు. కబడ్డీకి మరింత ప్రాచుర్యం తీసుకురావడానికి ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్ స్టార్ ఆడే స్టేడియంలోనే అవే సౌకర్యాలతో ఆడించడం ద్వారా ప్రత్యక్ష అనుభూతి కల్పించడం ఈ మ్యాచ్‌ల ఉద్దేశమని నిర్వహకులు పేర్కొన్నారు.

## క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

కౌలాలంపూర్: సీజన్ ఆరంభ టోర్నీ మలేషియా ఓపెన్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా జోడీలు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టగా.. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో గురువారం సాత్విక్-చిరాగ్ జోడీ 21-11, 21-18తో లూకాస్ కార్వీ-రోనాన్ లాబర్ (ఫ్రాన్స్) జంటపై గెలుపొందింది. తొలి రౌండ్‌లో ఆకట్టుకున్న శ్రీకాంత్ ప్రిక్వార్టర్స్‌లో 13-21, 17-21 లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓటమి పాలయ్యాడు. అశ్విని-తనీషా ద్వయం 21-19, 13-21, 21-15తో జపాన్ జోడీపై నెగ్గింది.

## గజ్వేల్‌లో కబడ్డీ టోర్నీ

బరిలో 33 జిల్లాల ప్లేయర్లు

గజ్వేల్ అర్బన్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ వేదికగా 49వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌తో పాటు క్రీడల నిర్వహణ కమిటీ శ్రమించి టోర్నీ ఏర్పాట్లు చేసింది. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పోటీపడుతుండగా, వెయ్యి మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పతకాలను ఆవిష్కరించగా, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గజ్వేల్ ఆతిథ్యమివ్వడం గర్వంగా ఉందన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.